క్లుప్తంగా

బాధిత కుటుంబానికి రెడ్ క్రాస్ సహాయం



బాధిత కుటుంబానికి సాయం అందిస్తున్న బుజ్జిరాజు

మలికిపురం: మండలంలో శంకరగుప్తంలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదానికి సర్వం కోల్పోయిన ఇంజేటి వసంతరావు కుటుంబానికి జిల్లా ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆర్థికసాయం అందించింది. ఆదివారం సంస్థ జిల్లా శాఖ ప్రెసిడెంట్ కలెక్టర్ హిమాన్షుశుక్లా ఆదేశాలతో, చైర్మన్ కోరుకొండ సత్యనారాయణ (ఢిల్లీ నారాయణ) పర్యవేక్షణలో టార్పాలిన్, హైజెనిక్ కిట్, వంట సామగ్రి, బియ్యం, కూరగాయలు అందించారు. రాజోలు, గన్నవరం నియోజకవర్గాల రెడ్ క్రాస్ కార్యక్రమాల సమన్వయకర్త జంపన బుజ్జి రాజు చేతుల మీదుగా అందించారు. దాతలను గ్రామస్తులు అభినందించారు. కార్యక్రమంలో రెడ్ క్రాస్ జిల్లా మేనేజింగ్ కమిటీ సభ్యులు బోనం రాజు, నేతల నాని, సొసైటీ ప్రెసిడెంట్ చింతా కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గేదాలమ్మని దర్శించుకున్న 'విప్పర్తి'



బెల్లంపూడిలో గేదాలమ్మకి పూజలు చేస్తున్న పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి విప్పర్తి దంపతులు

పి.గన్నవరం: బెల్లంపూడిలో నూతనంగా నిర్మించిన ఆలయంలో గేదాలమ్మ అమ్మవారిని పి.గన్నవరం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి, జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు ఆదివారం దర్శించుకున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఉపాధ్యక్షుడు విప్పర్తి నిఖిల్‌కృష్ణ, పార్టీ నాయకులు అనిశెట్టి పండు, బండి రాంబాబు, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య సేవలు



గోగన్నమఠంలో ఆరోగ్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ అశోక్‌వర్మ

మామిడికుదురు: గోగన్నమఠంలో ఆదివారం జరిగిన మెగా వైద్య శిబిరంలో సుమారు 200 మందికి ఉచితంగా వైద్య సేవలందించారు. భూపతిరాజు భరత్‌వర్మ స్మారకార్థం ఏర్పాటు చేసిన శిబిరంలో గుండె, కిడ్నీ, నరాలు, ఊపిరితిత్తులు, లివర్, జనరల్ సర్జరీ, బీపీ, సుగర్, థైరాయిడ్ తదితర సమస్యలకు సంబంధించి డాక్టర్లు భూపతిరాజు అశోక్‌వర్మ, ప్రసాద్‌రాజు, స్వప్న రోగులను పరీక్షించి ఉచితంగా మందులు అందించారు. వీటితో పాటు రక్త పరీక్షలు, యూరిన్ పరీక్షలతో పాటు ఈసీజీలు తీశారు. గ్రామీణ ప్రాంతాల ప్రజలకు ఉచిత వైద్య శిబిరాల ద్వారా సేవలందించడం ఆనందంగా ఉందని మాజీ జెడ్పీటీసీ భూపతిరాజు ఈశ్వరరాజువర్మ, వైస్ ఎంపీపీ భూపతిరాజు లక్ష్మి పేర్కొన్నారు.

రైతుల చొరవతో పంట కాలువకు మోక్షం



నగరంలో జేసీబీతో పూడిక తొలగింపు

మామిడికుదురు: నగరం గ్రామంలోని గుర్రాలచెరువు పంట పొలాలకు సాగునీరు అందక ఇబ్బంది పడుతున్న రైతులు ఆదివారం స్వచ్ఛందంగా పంట కాలువను బాగు చేయించుకున్నారు. జేసీబీ సహాయంతో పంట కాలువలో పూడికతో పాటు గుర్రపుడెక్కను, తూడును తొలగించారు. గుర్రాల చెరువు ప్రాంతంలో సుమారు 150 ఎకరాల ఆయకట్టు ఉంది. ఈ ప్రాంతానికి సాగునీరు అందించే పంట కాలువ గుర్రపుడెక్క, తూడుతో పూర్తిగా మూసుకు పోయింది. దీంతో సాగునీటి కోసం రైతులు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారు. రైతులు తమ సమస్యను ఎంతో కాలం నుంచి ఇరిగేషన్ అధికారుల దృష్టికి తీసుకు వెళ్తున్నా ప్రయోజనం లేకుండా పోయింది. దీంతో విసిగి వేసారిన రైతులు స్వచ్ఛందంగా పంట కాలువ అభివృద్ధికి ముందుకు వచ్చి జేసీబీతో పంట కాలువను బాగు చేయించారు. దీంతో రైతులు ఎదుర్కొంటున్న సాగునీటి పారుదలకు ఉన్న ఏకైక ఆటంకం తొలగిపోయింది.

నూతన పింఛన్ల పంపిణీ

- ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు
- నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన



రాజోలులో నూతనంగా మంజూరైన పింఛన్ అందిస్తున్న ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు



గుడిమెళ్లంకలో రోడ్డు పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే రాపాక వర ప్రసాదరావు

రాజోలు: రాష్ట్రంలో సామాజిక బాధ్యత సీఎం జగన్ మోహన్‌రెడ్డి పాలనలోనే సాధ్యమైందని ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. ఆదివారం రాజోలు మండలం పరిషత్ కార్యాలయంలో నూతనంగా మంజూరైన వృద్ధాప్య, వితంతు, దివ్యాంగ పింఛన్లను ఎమ్మెల్యే రాపాక పంపిణీ చేశారు. అలాగే ప్రభుత్వం పెంచిన రూ.3 వేలను పింఛన్‌దారులకు అందజేశారు. ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు మాట్లాడుతూ అనేక సంక్షేమ పథకాల ద్వారా ఆర్థిక సాయం అందిస్తూ నిరుపేదలకు ప్రభుత్వం అండగా నిలుస్తుందన్నారు. అభివృద్ధి వైపు సాగాలంటే ప్రతి ఒక్కరూ విద్యను అభ్యసించాలనే సదుద్దేశంతో ప్రభుత్వం పాఠశాలలను నాడు–నేడు పథకంతో రూపురేఖలు మార్చివేసిందన్నారు. ఇంగ్లీషు మీడియం తీసుకువచ్చి కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేశారన్నారు. నియోజకవర్గంలో రక్షిత తాగునీటి కొరత రాకుండా అనేక వాటర్ ట్యాంకుల నిర్మాణం, పైపు లైన్లు ఏర్పాటు చేశామన్నారు. అలాగే చింతలమోరి–కరవాక రోడ్డు పనులు జరుగుతున్నాయని, త్వరలో లక్కవరం–మలికిపురం, మామిడికుదురు–గోగన్నమఠం రోడ్ల నిర్మాణానికి పనులు ప్రారంభిస్తామన్నారు. గత ప్రభుత్వం రోడ్ల అభివృద్ధి చేయడానికి ఒక్క పైసా నిధులు కేటాయించలేదని, అలాంటి రోడ్లను ప్రస్తుతం నిర్మించేందుకు చర్యలు చేపట్టామన్నారు. రాజోలులో పాడైపోయిన బైపాస్ రోడ్డును సీసీ రోడ్డు నిర్మాణం చేసి దానికి ఆనుకుని సీసీ డ్రైనేజీ నిర్మాణం పూర్తి చేశామన్నారు. రాబోయే ఎన్నికల్లో మళ్లీ సీఎంగా జగన్ మోహన్ రెడ్డిని విజయపథంలో నిలపాలని ఎమ్మెల్యే రాపాక కోరారు. ఏఎంసీ చైర్‌పర్సన్ గుబ్బల రోజారమణి, జెడ్పీటీసీ మట్టా శైలజ, సర్పంచ్‌లు రేవు జ్యోతి, నక్కా రామారావు, బడుగు శ్రీనివాసరావు, కుక్కల బేబికుమారి, ఎంపీటీసీలు చెల్లింగి లక్ష్మీఈశ్వరి, కొపనాతి పుష్పలత, నాయకులు దార్ల పెదబాబు, తెన్నేటి కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణీ

రాజోలు: ఆపన్నులకు ముఖ్యమంత్రి సహాయ నిధి అండగా నిలుస్తుందని రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. తాటిపాక గ్రామానికి చెందిన ఇంజేటి లలితకుమారికి ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన రూ.లక్ష చెక్కును ఆదివారం ఎమ్మెల్యే రాపాక అందజేశారు. లలిత కుమారి భర్త రామచంద్రరావు గతంలో అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స తీసుకుని ఆర్థిక సాయం కోసం సీఎం సహాయ నిధికి దరఖాస్తు చేసుకున్నారు. అయితే ఇటీవల ఆయన మృతి చెందగా మంజూరైన సీఎం రిలీఫ్ రూ.లక్ష చెక్కును భార్య లలితకుమారికి ఇచ్చారు. ఏఎంసీ చైర్‌పర్సన్ గుబ్బల రోజారమణి, నాయకులు మెడబల రాజ్‌కుమార్, గుబ్బల మనోహర్, తిరుమాని రాజు, అప్పారి పెద సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రోడ్లన్నీ అభివృద్ధి చేస్తున్నాం

మలికిపురం: నియోజకవర్గంలో రహదారులన్నీ ప్రాధాన్యతా పరంగా అభివృద్ధి పరుస్తున్నామని ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. మలికిపురం మండలం గుడిమెళ్లంక దుర్గమ్మ తల్లి గుడి సెంటర్ నుంచి రామరాజులంక వెళ్లే రహదారి పనులకు ఆదివారం ఎమ్మెల్యే రాపాక భూమి పూజ చేశారు. ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వాలు నాసిరకంగా నిర్మాణం చేయడం వల్ల నియోజకవర్గంలో రోడ్లన్నీ అధ్వానస్థితికి చేరాయని అన్నారు. ఓ వైపు సంక్షేమ, మరోవైపు అభివృద్ధిని సమానంగా ముందుకు తీసుకు వెళ్తున్న ఏకైక సీఎం జగన్ మాత్రమేనని అన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలంతా మరోసారి దీవించి ముఖ్యమంత్రిని చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో స్థానిక ఎంపీపీ మేడిచర్ల వెంకట సత్యవాణి, సర్పంచ్ నల్లి విజయకుమారి, ఎంపీటీసీ నల్లి అంజలీదేవి, నాయకులు కేవీఎస్ఎన్ రాజు, గ్రామ నాయకులు పెన్మెత్స రంగరాజు, గాది సురేష్, చింతా రాజబాబు, రొక్కాల వెంకట్, కానూరి బాబి, తదితరులు పాల్గొన్నారు.

విజయవాడ వెళ్లి పింఛన్ అందజేత



చక్రపాణికి పింఛన్ అందిస్తున్న వలంటీర్ రాజా

మలికిపురం: మండలంలోని పడమటిపాలేనికి చెందిన వలంటీర్ వాండ్రపు సత్యనారాయణ (రాజా) విజయవాడకుకు వెళ్లి పింఛన్ అందించారు. విజయ మల్టీసూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ విజయవాడలో కిడ్నీ మార్పిడి ఆపరేషన్ చేయించుకున్న పడమటిపాలెంకు చెందిన అడబాల చక్రపాణి డయాలసిస్ నిమిత్తం విజయవాడలో ఉన్నారు. ఈనెల డయాలసిస్ పింఛన్ రూ.10 వేలను వలంటీర్ రాజా ఆదివారం విజయవాడ వెళ్లి అందించారు. రాజాను ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు, మండల పార్టీ అధ్యక్షుడు అభినందించారు.

నేడు నర్శిపూడిలో గడపగడపకూ..

అలమూరు: మండలంలోని నర్శిపూడిలో సోమవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం జరగనుందని పార్టీ మండల కన్వీనర్ తమ్మన శ్రీనివాసు, ఎంపీడీఓ కె.జాన్‌లింకన్ తెలిపారు. వారు ఆదివారం మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి కొత్తపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుని సత్వర పరిష్కార మార్గం సూచిస్తారన్నారు. ఉదయం ఎనిమిది గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమానికి అధికారులు, ప్రజా ప్రతినిధులు తప్పనిసరిగా హాజరు కావాలని వారు పేర్కొన్నారు.

పేదల పక్షపాతి సీఎం జగన్



చెముడులంకలో లబ్ధిదారులకు పింఛన్లు అందజేస్తున్న ప్రజా ప్రతినిధులు

అలమూరు: రాష్ట్రంలోని పింఛన్‌దారులందరికీ గత ఎన్నికల్లో హామీ ఇచ్చిన విధంగా రూ.3 వేలు పెంపు చేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పేదల పక్షపాతి అనిపించుకున్నారని పార్టీ మండల కన్వీనర్, సర్పంచ్ తమ్మన శ్రీనివాసు అన్నారు. మండలంలోని చెముడులంక శ్రీకృష్ణదేవరాయ కల్యాణ మండపంలో ఆదివారం లబ్ధిదారులకు కొత్త పింఛన్లతో పాటు పెరిగిన పింఛన్ల సొమ్ము పంపిణీ జరిగింది. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక విద్య, ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించి ఆ దిశగా చర్యలు తీసుకుంటుందన్నారు. ఇప్పటికే వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పరిమితిని రికార్డు స్థాయిలో రూ.25 లక్షలకు పెంచిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. మాజీ సర్పంచ్‌లు నాగిరెడ్డి సత్యనారాయణ, బుడ్డిగ వీర వెంకట్రావు, ఉప సర్పంచ్ దొండపాటి చంటి, కార్యదర్శి యు.రేణుక, తమ్మన హరికృష్ణ, అడబాల వీర్రాజు, బులిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

175 సీట్లలో వైఎస్సార్ సీపీదే గెలుపు



సమావేశంలో మాట్లాడుతున్న పార్టీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు ఎంవీఎస్ఎన్ స్వామి

అయినవిల్లి: వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ 175 సీట్లలో గెలుపు సాధిస్తుందని మరలా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం కావడం ఖాయమని వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు మిండగుదిటి వెంకటసాయి శిరీష్ నారాయణస్వామి (ఎంవీఎస్ఎన్ స్వామి) అన్నారు. జిల్లాలో విద్యార్థి విభాగం మొట్టమొదటి సమావేశం మండలంలోని వీరవల్లిపాలెంలో ఆదివారం నిర్వహించారు. ఎంవీఎస్ఎన్ స్వామి ఈ సమావేశానికి అధ్యక్షత వహించి మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్నడూ లేని విధంగా విద్యార్థులకు అమ్మ ఒడి, విద్యాదీవెన, వసతి దీవెన, విదేశీ విద్య, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి సంక్షేమ పథకాలను అమలు చేసి పేదల విద్యార్థులు చదువు కొనసాగించేందుకు సహకారం అందజేశారన్నారు. అలాగే ఈ నెల 24న అమలాపురంలో జరిగే విద్యార్థి సాధికార యాత్రను జిల్లాలోని విద్యార్థులు విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో విద్యార్థి విభాగం జిల్లా ఉపాధ్యక్షులు తాడి సహదేవ్, మట్టపర్తి మణికుమార్, రాష్ట్ర కార్యదర్శి బోడే శ్రీకృష్ణ, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కాశి ఆశిష్, జక్కంపూడి మణికంఠ, రాష్ట్ర కమిటీ సభ్యులు జిల్లెళ్ల రమేష్, వింటి రాజా, పార్టీ నాయకులు సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

జగన్‌ను మళ్లీ సీఎం చేసేందుకు కృషి చేయాలి



మాచవరంలో విప్పర్తిని సత్కరిస్తున్న ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు

అంబాజీపేట: వైఎస్సార్ సీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎంని చేసేందుకు సమష్టిగా కృషి చేయాలని పి.గన్నవరం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి, జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు పార్టీ శ్రేణులకు విజ్ఞప్తి చేశారు. ఆదివారం ఆయన మాచవరం గ్రామంలోని వరసిద్ధి వినాయక స్వామిని దర్శించుకుని పూజలు చేశారు. అనారోగ్యంతో బాధపడుతున్న ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావును పరామర్శించారు. అనంతరం ఆయన పార్టీ నాయకులు, కార్యకర్తలతో మాట్లాడారు. జగన్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలందరికీ వివరించి, మద్దతు కోరాలని సూచించారు. ఈసందర్భంగా విప్పర్తిని ఎంపీపీ వెంకటేశ్వరరావు సత్కరించారు. జెడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, నాయకులు ముత్తాబత్తుల ప్రశాంత్, కొర్లపాటి కోటబాబు, ఉందుర్తి నాగబాబు, వాసంశెట్టి పెదబాబు, ముత్తాబత్తుల మణిరత్నం, మట్టపర్తి హరి, వెన్నపు రాంబాబు, పితాని వీరాస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత ప్రయాణ హామీని విరమించుకోవాలి



పి.గన్నవరంలో శాంతి ర్యాలీ నిర్వహిస్తున్న ఆటో యూనియన్ నాయకులు



అంబాజీపేటలో శాంతి ర్యాలీ నిర్వహిస్తున్న ఆటో వాలాలు



పాశర్లపూడి కొండాలమ్మచింత సెంటర్లో ధర్నా చేస్తున్న ఆటో కార్మికులు

పి.గన్నవరం, అంబాజీపేట: ఏపీలో రాజకీయ పార్టీలు మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పిస్తామన్న హామీలను విరమించుకోవాలని పి.గన్నవరం, అంబాజీపేట మండలాలకు చెందిన ఆటో యూనియన్ల నాయకులు విజ్ఞప్తి చేశారు. ఆర్టీసీ బస్సులో మహిళలకు ఉచిత ప్రయాణం హామీని నిరసిస్తూ ఆదివారం రెండు మండలాల్లో శాంతియుత ర్యాలీ నిర్వహించారు. ఆటో యూనియన్ల నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలోని రాజకీయ పార్టీలు మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం హామీతో ఆటో వాలాలు రోడ్డున పడతారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాలో అమలు చేస్తున్న ఈ పథకంతో కిరాయిలు లేక ఆటోవాలాల కుటుంబాలు రోడ్డున పడ్డాయన్నారు. కొంతమంది ఆటోవాలాలు భిక్షాటన చేస్తుంటే, మరికొంత మంది ఆత్మహత్యలకు పాల్పడిన సందర్భాలు ఉన్నాయన్నారు. అంబాజీపేట మండలంలో సుమారు 200, పి.గన్నవరం మండలంలో 300 ఆటోలు ఉన్నాయన్నారు. వీటిపై వందలాది కుటుంబాలు ఆధారపడి జీవిస్తున్నాయని వివరించారు. జిల్లా యూనియన్ పిలుపు మేరకు అమలాపురం వరకూ శాంతి ర్యాలీ నిర్వహించారు.

ఆటో కార్మికుల ధర్నా

మామిడికుదురు: ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం నిర్ణయాన్ని పాలక, ప్రతిపక్షాలు విరమించుకోవాలని డిమాండ్ చేస్తూ ఆటో కార్మికులు ఆదివారం పాశర్లపూడి కొండాలమ్మచింత సెంటర్లో ఆదివారం ధర్నా చేశారు. మండలంలోని ఆరు యూనియన్లకు చెందిన కార్మికులు ర్యాలీగా కొండాలమ్మ చింత సెంటర్‌కు చేరుకున్నారు. మహిళలకు ఉచిత ప్రయాణం ద్వారా తమ ఉపాధిని దెబ్బతీయొద్దని డిమాండ్ చేశారు. ఈ నిర్ణయాన్ని తక్షణం ఉపసంహరించుకోవాలని నినాదాలు చేశారు. మండల యూనియన్ గౌరవాధ్యక్షుడు కడలి రమేష్, అధ్యక్షుడు తాడి రాజేష్, పాశర్లపూడి, అప్పనపల్లి, నగరం, మామిడికుదురు, కరవాక యూనియన్ల అధ్యక్షుడు కుడుపూడి సుబ్రహ్మణ్యం, తాడి దుర్గాప్రసాద్, గొల్లమందల రవికుమార్, చింతపల్లి రమేస సిర్రా పాపారావు పాల్గొన్నారు. ధర్నా అనంతరం అమలాపురం వరకూ ర్యాలీగా వెళ్లారు.

ర్యాలిలో జిల్లా స్థాయి చెకుముకి సంబరాలు



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

ఆత్రేయపురం: మండలంలోని ర్యాలి గ్రామంలో సాంగ్ ఆఫ్ జాయ్ స్కూల్ డైరెక్టర్ పీఎస్‌రెడ్డి జయపాల్ సౌజన్యంతో జిల్లాస్థాయి చెకుముకి సంబరాన్ని నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి 26 మండలాల నుంచి 52 టీంలు ఈ సంబరాల్లో పాల్గొన్నాయి. ఈ పోటీల్లో జిల్లా స్థాయి ప్రభుత్వ పాఠశాలలో ప్రథమ స్థానం చెముడులంక జెడ్పీ హైస్కూల్, ద్వితీయ స్థానం థానేలంక జెడ్పీహెచ్ఎస్, తృతీయ స్థానం దంగేరు జెడ్పీహెచ్ఎస్, ప్రైవేట్ పాఠశాలల్లో మండపేట అన్నపూర్ణ ఇంగ్లీష్ మీడియం స్కూల్ ప్రథమ స్థానం, అమలాపురం ఆదిత్య స్కూల్ ద్వితీయ స్థానం, ముమ్మిడివరం భాష్యం స్కూల్ తృతీయ స్థానం కైవసం చేసుకున్నాయి. జిల్లా స్థాయి విజేతలకు జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు వీఆర్ సుబ్రహ్మణ్యం, ప్రధాన కార్యదర్శి కాజా మొహిద్దీన్ ఆధ్వర్యంలో శ్యామ్ అడ్వాన్స్‌డ్ ఫిజియోథెరపీ అండ్ రిహేబిలిటేషన్ సెంటర్ అధినేత డాక్టర్ మోహిత్ సౌజన్యంతో బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జేవీవీ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు డాక్టర్ సి.స్టాలిన్, రాష్ట్ర ప్యానల్ డాక్టర్ సీహెచ్ రవికుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కేవీవీ సత్యనారాయణ, యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జ్యోతి బసు, యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వెంకటేశ్వరరావు, సుబ్బారావు, చెకుముకి జిల్లా కన్వీనర్ అబ్బులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గొబ్బెమ్మలు, భోగిపళ్లు



కొత్తపేటలో గొబ్బెమ్మల పూజ నిర్వహిస్తున్న బాలికలు

కొత్తపేట: సంక్రాంతి నెల సందర్భంగా స్థానిక సత్యసాయి నిలయంలో గొబ్బెమ్మలు, భోగిపళ్ల కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. సత్యసాయి సేవా సమితి కన్వీనర్ కంకటాల సత్యనారాయణ ఆధ్వర్యంలో సమితి సభ్యులు పర్యవేక్షణలో బాలబాలికలతో స్వామివార్లకు ప్రత్యేక పూజలు, బాలికలతో గొబ్బెమ్మల కార్యక్రమం నిర్వహించారు. బాలలకు పెద్దలు భోగిపళ్లు పోసి ఆశీర్వదించారు. అనంతరం ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో సమితి సభ్యులు చింతం రామకృష్ణ, సత్యవరపు భాస్కరరావు, మహిళా మండలి సభ్యులు పాల్గొన్నారు.

రెండు గ్రామాల్లో వికసిత్ భారత్

అయినవిల్లి: మండలంలోని నల్లచెరువు, ఎస్.పెదపాలెం సర్పంచులు గుండుమొగుల వెంకటేశ్వరరావు, శీలం వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఆదివారం వికసిత్ భారత్ కార్యక్రమంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బీజేపీ పి.గన్నవరం నియోజకవర్గం అసెంబ్లీ కన్వీనర్ చీకురుమిల్లి వెంకటేశ్వరరావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ద్వారా వస్తున్న వివిధ పథకాలకు సంబంధించిన నిధులు వాటి ఉపయోగం గురించి వివరించారు.

తలసేమియా బాధిత బాలికకు ఆర్థిక సాయం



బాలిక తండ్రికి సాయం అందజేస్తున్న కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు

రావులపాలెం: తలసేమియా వ్యాధితో బాధపడుతున్న బాలికకు స్థానిక కాశీఅన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు ఆదివారం రూ.16 వేల ఆర్థిక సాయం అందజేశారు. పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు మండలం దిగమర్రు గ్రామానికి చెందిన తవిటికి జెస్లిన్ వయసు నాలుగేళ్లు. తలసేమియా వ్యాధితో బాధపడుతుంది. పాప పుట్టిన నాలుగో నెల నుంచి ప్రతి నెలా బ్లడ్ ఎక్కించాల్సిన పరిస్థితి ఇప్పుడు పాపకి ఆపరేషన్ చేస్తే ప్రతి నెల బ్లడ్ మార్చాల్సిన అవసరం ఉండదని డాక్టర్లు తెలిపారు. దీనికి రూ.20 లక్షల వరకు ఖర్చవుతోంది. అంత స్తోమత లేని వీరు సహాయం కోసం కాశీ అన్నపూర్ణ సేవా సంస్థ సభ్యులను కోరగా, రావులపాలెంలో జెస్లిన్ తండ్రి జీవన్‌రాజుకి సంస్థ సభ్యుల చేతుల మీదుగా రూ.16 వేల సాయం అందజేశారు.

దేశాన్ని ప్రగతి పథంలో తీసుకువెళుతున్న మోదీ



సఖినేటిపల్లిలో వికసిత్ భారత్ క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న అయ్యాజీ వేమా

సఖినేటిపల్లి: ప్రపంచంలో వినూత్నమైన ప్రగతి పథంలో భారతదేశాన్ని ప్రధాని మోదీ తీసుకువెళుతున్నారని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మానేపల్లి అయ్యాజీ వేమా అన్నారు. ఆదివారం సఖినేటిపల్లి, టేకిశెట్టిపాలెం పంచాయతీల వద్ద నోడల్ అధికారి బడుగు మంగాదేవి ఆధ్వర్యాన వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమాల సమావేశాలు నిర్వహించారు. సఖినేటిపల్లిలో ఉపసర్పంచ్ ఇందుకూరి రమేష్‌రాజు, టేకిశెట్టిపాలెంలో సర్పంచ్ పోతు దేవీదుర్గ అధ్యక్షతన జరిగిన సమావేశాల్లో పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అయ్యాజీ వేమా ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మన సంకల్పం వికసిత్ భారత్ క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించారు. దేశంలో ప్రతి రంగంలోనూ ప్రజలకు అవసరమైన రీతిలో మార్పులు ప్రధాని మోదీ తెస్తున్నారన్నారు. అనంతరం ఆయా శాఖల్లో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల ప్రాధాన్యం, వాటి ఉపయోగాలపై సదరు అధికారులు వివరించారు. పార్టీ రాష్ట్ర కార్యవర్గ మెంబర్ అడబాల సత్యనారాయణ, జిల్లా అధికార ప్రతినిధి మాలే శ్రీనివాస నగేష్, రాష్ట్ర కిసాన్ మోర్చా డ్రైనేజీ సెల్ కన్వీనర్ చెంపాటి శివరామకృష్ణంరాజు, మండల అధ్యక్షుడు పట్టపు సూర్యప్రకాశరావు, ఉపాధ్యక్షుడు తిరుమల వెంకటేశ్వరరావు, నాయకులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



1984-85 నాటి పూర్వ విద్యార్థుల సమ్మేళనం

అయినవిల్లి: వీరవల్లిపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. 1984–85లో చదివిన విద్యార్థులంతా ఒక్కచోటకు చేరి అలనాటి తీపి గురుతులను జ్ఞప్తికి తెచ్చుకున్నారు. ఆనాటి గురువులను సత్కరించారు. సినీ గీతాలకు నృత్యాలు చేశారు. కేరింతలు కొడుతూ చిన్నపిల్లల్లా మారారు.

మూడు గ్రామాల్లో అయోధ్య అక్షతల పంపిణీ



నగరం శివాలయం నుంచి అక్షతల పంపిణీకి బయలుదేరిన భక్తులు



అప్పనరామునిలంకలో అక్షతల కలశాన్ని ఊరేగిస్తున్న భక్తులు

మామిడికుదురు: అయోధ్య నుంచి తీసుకువచ్చిన బలరాముని అక్షతల పంపిణీ కార్యక్రమం ఆదివారం మూడు గ్రామాల్లో ఘనంగా జరిగింది. మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, బాణసంచా కాల్పులు, భక్తుల కోలాహలం నడుమ ఈ కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. జై శ్రీరామ్, జైజై శ్రీరామ్ నినాదాలు చేస్తూ భక్తులు రెట్టించిన ఉత్సాహంతో అక్షతల పంపిణీలో పాల్గొన్నారు. నగరం, కొమరాడ, ఈదరాడ గ్రామాల్లో అక్షతల పంపిణీ జరిగింది. నగరం గ్రామంలోని శివాలయం నుంచి పెట్రోల్ బంకు వరకు జరిగిన కార్యక్రమంలో గ్రామ ప్రముఖ్ తాటికాయల చిన వెంకటేశ్వరావు, మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అప్పనరామునిలంకలో..

సఖినేటిపల్లి: అయోధ్యలో పూజలు అందుకున్న బాలరాముడి అక్షతలను ఆదివారం అప్పనరామునిలంకలో ఇంటింటా శ్రీరామ భక్తులు పంపిణీ చేశారు. అలాగే అయోధ్యలో రామాలయం ప్రారంభోత్సవ ఆహ్వానాలను కూడా అందజేశారు. తొలుత జై శ్రీరామ్ అంటూ భక్తుల నినాదాలతో గ్రామం అంతటా అక్షతల కలశాలతో ఊరేగుతూ ఈ పంపిణీ నిర్వహించారు. 22న అందరూ తమ, తమ ఇళ్ల వద్ద దీపాలు వెలిగించాలని కోరారు. సర్పంచ్ ఇందుకూరి సుబ్బరాజు, మాజీ సర్పంచ్ బర్రే శ్రీను, అధిక సంఖ్యలో మహిళా భక్తులు పాల్గొన్నారు.

చొప్పెల్లలో..

ఆలమూరు: మండలంలోని చొప్పెల్లలో అయోధ్య శ్రీరామ అక్షతల పంపిణీ ఆదివారం జరిగింది. మండల అధ్యక్షుడు నాగిరెడ్డి స్వామి, స్థానిక హరేరామ భజన భక్తి బృందం నేతృత్వంలో మదనగోపాల స్వామి ఆలయ అర్చకుడు ఏడిద సూర్యగోపాలాచార్యులు, లక్ష్మణాచార్యులతో పాటు రామభక్తులు గ్రామంలో పర్యటించారు. మేళతాళాలతో పల్లకీలో శ్రీరాముని ఊరేగిస్తూ వీధివీధినా తిరిగి శ్రీరామ నామ సంకీర్తన చేస్తూ ప్రతి ఇంటికీ కరపత్రాలు, మహిమాన్విత అక్షతలు వితరణ చేశారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాలూరి సత్యానందం, కొత్తపేట నియోజకవర్గ ఆర్ఎస్ఎస్ అధ్యక్షుడు కృష్ణశర్మ, ఏబీవీపీ రాష్ట్ర నాయకులు జి.అంజనీ శ్రీనివాస్ పాల్గొన్నారు.

జాతీయ శిక్షణకు హరి సూర్యనారాయణ

కె.గంగవరం: పాణింగపల్లి ఉన్నత పాఠశాల బయోలాజికల్ సైన్స్ టీచర్ పసిగాడి హరి సూర్యనారాయణ రీజినల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో మైసూర్‌లో జరిగే జాతీయ శిక్షణకు ఎంపికయ్యారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎంపికైన 29 మంది ఉపాధ్యాయుల్లో హరిసూర్యనారాయణ ఒకరు. జాతీయ స్థాయి శిక్షణకు ఎంపికవడంపై సూర్యనారాయణను ఎంఈఓ నాగరాజు అభినందించారు.